# పెనుభూతం

**- నియాడ్ అలి**

పెళ్లిచూపులకొచ్చిన అత్తగారి 'కట్నం వద్దన్న' ఉదారత గురించి విని అమ్మ ముందు అనుమానం వ్యక్తం చేసాను. 'పెళ్లయ్యాక ఒక్కసారిగా లక్షలు పట్రమ్మని వేధిస్తుందేమో పాడో, గ్యాసు తిప్పేసి తగలబెట్టేసినా తగలెట్టేయొచ్చును' అని. అమ్మ నవ్వింది సుతారంగా నెత్తిమీద మొట్టుతూ.

"అనుమానం వచ్చిందా తల్లీ. అయినా వాళ్లకి లక్షలెందుకే పిచ్చిమొద్దూ. బంగారు తీగెలాంటి అందమైన, మంచి ఉద్యోగం చేసే కోడలొస్తుందాయె. ఒక్కగానొక్క కొడుకు, తల్లీదండ్రీ కొడుకూ, పెళ్లయి అత్తారింట్లో వున్న కూతురూ, అందరికీ పెద్ద పెద్ద చదువులూ, పెద్ద పెద్ద ఉద్యోగాలూనూ. తమకి తగ్గ కోడలొస్తుందని వాళ్ళు మురుస్తుంటే నువ్వేమో వాళ్లని అనుమానిస్తున్నావా? సరేలే ఇలా రేపు ఆ అబ్బాయిని చీటికీ మాటికీ నీ పిచ్చి పిచ్చి అనుమానాలతో వేధించుకు తినకేం" అంటూ వాళ్లకి మర్యాద చేసే పనిలో పడిపోయింది.

నిశ్చితార్థం అయిపోయింది.

వాళ్ళు వెళ్లిపోయాక అమ్మ నాన్నగారితో అంటూండడం నా చెవిన పడింది.

"కనీసం వంటొచ్చునా అనైనా అడగలేదండీ ఆవిడ. నేనే చెప్పడం మంచిదని టీ పెట్టడం మాత్రం బాగా వచ్చును అని చెప్పా. ఆవిడగారు మరేమనక నవ్వి ఊరుకుంది."

"అంటే... ఏదో పెద్ద ప్లానే కావచ్చును. ఏమై ఉండొచ్చు" వెంటనే మరో అనుమానం నాకు.

★★★

అమ్మ అన్నంతా అయింది.

ఆ రాత్రి నాకు ఎన్నెన్నో అనుమానాలూ, సందేహాలూను. వింటూ ఆయన విచిత్రంగా, వింతగా చూసారు నాకేసి. ఆ తరువాత తాపీగా-

"మరి నాకూ తెలియదే. నాకూ ఇదే మొట్టమొదటి పెళ్లి మరి" అంటూ అల్లరిగా నవ్వేసారు.

అలా నా అనుమానాల పర్వం పుట్టింట్లో నుంచి అత్తవారింట్లోకి నాతోపాటే రంగప్రవేశం చేసింది.

★★★

అత్తగారింట్లో మర్నాడు లేచేసరికి వంటింట్లో అత్తగారికి బదులు ఎవరో నడివయసావిడ కన్పించేసరికి ఖంగుతిన్నాను.

హాల్లోంచి అత్తగారొస్తుండడం చూచి ఎదురెళ్లి సలాం చేసాను. ఆవిడ వంటావిడను పరిచయం చేసారు పిన్ని అంటూ. సలాం చేయమని సైగ చేసిన అత్తగారిని కావాలనే పట్టించుకోలేదు. సలాం చేయకున్నా కరీమున్ నా దగ్గరగా వచ్చి నా చెంపలు పుణికి మెటికలు విరుచుకుంది. మరెప్పుడూ అత్తగారు కానీ ఆయనగానీ ఆవిడకు సలాం చేయమని చెప్పలేదు.

వంటావిడ కరీమున్ (పిన్ని అనడం నాకిష్టం లేదన్నానుకదా) రోజూ తెల్లారగట్లే వచ్చి బయటంతా ఊడ్చి ఇల్లూ, గదులు శుభ్రం చేసి అంట్లగిన్నెలు తోమి టీ, టిఫిన్లు అందరికీ టైం ప్రకారం వేడివేడిగా డైనింగ్ టేబుల్ మీద అమర్చి పెడుతుంది. బియ్యం, గోధుమ పిండి, పప్పూ ఉప్పు అన్నీ తనే ఉజ్జాయింపుగా తీసుకుని వంట కానిచ్చేస్తుంది. కూరలు వండే విషయంలో మాత్రం 'ఏం కూర చేయను' అనడుగుతుంది అత్తగార్ని. నూనె, పంచదారలాంటివి అయిపోయే వేళకి ఒకటి రెండ్రోజులు ముందుగా చెప్తుంది. అలా వంటింటి పెత్తనమంతా ఆవిడకి అప్పజెప్పేయడం నాకస్సలు నచ్చలేదు. ఎంతయినా పరాయి మనిషి... కాస్తో కూస్తో ఇంటికి తీసుకుపోతుంటేనో... అయితే ఆ ఇంట్లో ఇదెవరికీ పట్టదని గమనించాను. నేనీ ఇంటి ఒక్కగానొక్క కోడల్ని.

నేనైనా ఈ కుటుంబం గురించి శ్రద్ధ తీసుకోవాలి అనుకుని గట్టి నిఘా వేశానామెమీద. పెళ్లికని తీసుకున్న రెండు నెలల లీవు ఎలాగూ ఉండనే ఉంది. ఒక్కదాన్నీ ఇంట్లో వుండి చేసేదేముంది కనుక!

★★★

మామగారు ఉదయాన్నే టీ చేయమని మెచ్చుకుంటూ తాగుతారు. రెండు పూటలా టీ నేనే చేస్తున్నాను. అలా టీ సెక్షన్ నాపరమైంది. నెమ్మదిగా టీ పెట్టే వంకతో వంటింట్లోకి రంగప్రవేశం చేసి పిండి, బియ్యం వగైరా నేనే తీసివ్వడం మొదలుపెట్టాను. ఆమె అర్థం చేసుకున్నట్టుంది. క్రమంగా అన్ని వస్తువులూ నన్నడిగి నేను ఇస్తేనే తీసుకుంటోంది. ఇంటికెళ్లే ముందు తన పాన్ డబ్బానీ, చేతి సంచినీ ఓసారలా నాముందే నేను చూచేలా తెరిచి పరోక్షంగా చూపి మరీ వెళ్తోంది. అంతేతప్ప అత్తగారికిగానీ మరెవరికిగానీ ఫిర్యాదు చేసినట్లులేదు.

"ఆమెగానీ వంట చేస్తుండగా..."మరో అనుమానం వచ్చిందోరోజు. ఏమో అలా కనుక జరుగుతుంటే చూడట్లేదు కదాని తను వండుతూ వండుతూ కూరముక్కల్లాంటివి నోట్లోగానీ వేసుకుంటుందేమో...ఛ..ఛ ఆమె ఎంగిలి తినాల్సిన గతి పట్టింది. సరే చూద్దామనుకుని పనేవీ లేకపోయినా అలా వంటింట్లోకి వెళ్లాను. కరీమున్ దీక్షగా కూర ఇగరబెడుతోంది. మాంసం కూర మసాలాల ఘుమాయింపుతో వంటిల్లంతా ఘుమఘుమలాడిపోతోంది. ఆపైన కూర ఇగురుతున్న చప్పుడొకటి. ఆమె నోటివైపు చూసాను. బుగ్గ నిండుగా వుంది. అంటే...నా అనుమానం నిజమేనన్న మాట!

"వంటయిపోవచ్చిందా" అంటూ ఆమె వెనుకగా వెళ్లి అడిగాను.

ఆమె నోరు విప్పక అదే ధ్యాసగా కూర కలుపుతూ ఇగరబెడుతూనే వుంది.

"కొత్తిమీర వేయలేదా" అనడిగానీసారి కాస్తంత గట్టిగా. ఆమె పక్కకి తిరిగి నావైపు చూసి స్టవ్ సిమ్‌కు తగ్గించేసి వడివడిగా పెరట్లోకెళ్లింది.

'నేనంటే ఎంత నిర్లక్ష్యం?' అని నేను కోపం తెచ్చుకోబోయేంతలోనే తుపుక్కున పాన్ ఉమ్మేసి నోరు పుక్కిలించుకుని వచ్చింది తాపీగా. నా సందేహం తీరిపోయింది. ఆమె ఏం చెప్తుందో వినాల్సిన అవసరం నాకిక లేకపోయింది.

★★★

నా సెలవు ఇంకా పక్షంరోజులు మిగిలింది.

అత్తగారు మాటల మధ్య మా ఇద్దర్నీ వేరు పెట్టబోతున్నారని తెలిసింది. ఈయన పేర కొన్న ఇల్లు అప్పటివరకూ అద్దెకిచ్చింది. పెళ్లికి ముందే ఖాళీ చేయించారట. అంతా శుభ్రం చేయించి పెయింట్ చేయించి ఫర్నిచర్ అంతా కొత్తది కొని అన్నీ

చక్కగా సర్దించి పెట్టారట. వారం పదిరోజులుగా అత్తగారూ, మామయ్యగారూ ఈయనా యమ బిజీగా ఉన్నారు. ఆ ఇంటినుంచి నాకూ ఈయనగారికీ ఆఫీసులకు చాలా దగ్గరట. పెళ్లయి కోడలు వచ్చీ రాగానే వేరు పెట్టే అత్తగార్ని ఈవిడనే చూసాన్నేను. ఈయనతో అదే అన్నాను.

తను కాస్త నవ్వేస్తూ "కొత్తగా పెళ్లయిన మన ప్రైవసీ అదేనోయ్... ఏకాంతం కోసమేనోయ్'' అంటూ చిలిపిగా అంటూంటే విసురుగా అన్నాన్నేను.

"మన ఏకాంతం కోసమా? లేక వాళ్లిద్దరి ఏకాంతానికి అడ్డుగా వున్నామనా?''

చివ్వున చూసారాయన.

చప్పున నాలుక కరుచుకున్నాను. అప్రయత్నంగా "సారీ'' అనేసాను కూడా. ఐతే మాట బయటకి రాలేదు. పెదాలు కదిలాయంతే. అది చూసి ఆయన మామూలుగా అయిపోయారు. అప్పటికి ప్రతిదానికీ అనుమానించే నా మనస్తత్వం ఆయనకు అర్థమైపోయిందని గ్రహించాను. మనసులో లెంపలేసుకున్నాను. కొంచెం నిగ్రహం పాటించాలి అనుకున్నాను నాకు నేనే.

★★★

కొత్త ఇంట్లోకి మారాం. రెండు బెడ్రూములు, హాలు, డైనింగ్ హాలు, డ్రాయింగ్‌రూమ్... అన్ని చోట్లా సరిపడ ఫర్నిచర్. నిజంగా ఆ ఇంట్లో మాకోసం లేనిదంటూ ఏమీలేదు. టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్, ఏర్‌కూలర్, చక్కటి కిచెన్ కాబినేట్, గ్రెండర్, గీజర్... అన్నీ చక్కగా అమర్చిపెట్టే అత్తమామగార్లు ఎందరికుంటారసలు? అంతా మా అమ్మానాన్నా కూతురుకు అదే నాకు ఇవ్వాల్సింది అత్తగారడగలేదు.

పైగా బలవంతాన ఇవ్వబోయినా సున్నితంగా తిరస్కరించేసారు 'మా అబ్బాయి ఇంటి కోసమేగా' అంటూ.



అన్నట్లు 'అదీ నిజమే కదా. నా కోసమేమీ కాదు కొడుకు కోసమేగా' అని మనసులో జోకొట్టాను.అమ్మ వచ్చి మాతో వారం రోజులుంది. ఆమె ముఖంలో సంతోషం, తృప్తి స్పష్టంగా చూడగలిగాను. అమ్మ వున్నన్ని రోజులూ ఆమే వంట చేసింది. అమ్మ వెళ్లిన సాయంత్రమే అసలు సమస్య ఎదురైంది. కరీమున్ చేతి మెత్తటి పుల్కాలు తినడం మామయ్యగారికీ ఈయనకు బాగా అలవాటు. రెండు పూటలూ పుల్కాలే తింటారు. నాకైతే వంటలో ఏబిసిడిలే రావు.

'భలేగా రోగం కుదిర్చావని మురిసిపోతుండవచ్చు అత్తగారు' కచ్చిగా అనుకున్నాను. 'ఇందుకన్నమాట మమ్మల్ని వేరు పెట్టింది. వంట రాదన్న నన్ను కోడలుగా తెచ్చుకున్నదీను! ఆ రాత్రి పుల్కాలు చేసి పాలకూర పప్పు చేసాను ఆపసోపాలు పడుతూ. వాటిని చూస్తే నాకే నమ్మకం కలగడంలేదు అవి పుల్కాలని. చపాతీలూ, పరాఠాలు కూడా కావవి. మరేం పేరు పెట్టాలో! డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నానన్న మాటేగానీ ఆయన పేపర్ చదువుతూ వచ్చి తినడానికి కూర్చున్నారు "ఏం చేసావోయ్" అంటూ.


## శివుడాజ్ఞ లేనిదే!

క్రోషియాలో జాగ్రెబ్ అనే చోట కన్‌స్ట్రక్షన్ వర్కర్ ఒకతను ఒక బిల్డింగ్‌లో పదకొండవ ఫ్లోర్‌లో పని చేస్తుండగా కాలుజారి 70 అడుగుల ఎత్తు నుంచి క్రిందకి పడిపోయాడు. సరాసరి నేలమీద పడిపోయి వుంటే దుర్మరణం పాలయ్యేవాడు. కానీ అతను పడిపోతుండగా నాల్గవ అంతస్థులోంచి బయటకు పొడుచుకువచ్చిన బల్లచెక్కమీద పడడంతో అదొక కుషన్‌లా పని చేసింది. 'ఇదివరకు రెండుసార్లు ఇలాగే జారిపడ్డాను. కానీ ఈసారి మాత్రం అంతెత్తు నుంచి పడ్డాక బ్రతకననే అనుకున్నాను. కానీ అదృష్టవశాత్తు ఆ బల్ల చెక్క నన్ను కాపాడింది" అన్నాడతను చిన్న ఫ్రాక్చర్ అయిన పాదాన్ని చూసుకుంటూ.

## పిజ్జా నెల

అమెరికాలో అక్టోబర్ మాసాన్ని 'మంత్ ఆఫ్ పిజ్జా' అంటారు. 1987 సంవత్సరం నుంచి ఈ సాంప్రదాయాన్ని పాటిస్తున్నారట. గెర్రీ డర్నెల్ అనే అయన దీనికి 'పిజ్జా టు డే' అనే పండుగని జరపడం ఆరంభించినప్పటి నుంచీ ఈ అలవాటు అన్నిచోట్లకీ పాకింది. అమెరికన్లు ఒకరోజున తినే పిజ్జాలని నేలబారున పరచుకుంటూపోతే వంద ఎకరాల మేర ఆవరించుకుంటుందిట.

-విమలారామం




నా గుండెలదిరాయి. పుల్కాలు తీసి ఇద్దరి ప్లేట్లలోనూ సర్దాను. కూర వడ్డించాను. పుల్కా తుంచబోయి సాధ్యంకాక రెండో చేయి సాయం కూడా తీసుకుని మరీ కూరద్దుకుని నోట్లో పెట్టుకున్నారు. అంతే! ఆయన మొహంలో క్షణంలో ఎన్నెన్ని రంగులు మారిపోయాయో! కూరలో కారానికి నోరు మండినట్టుంది. గటగటా మంచినీళ్లు త్రాగి విసురుగా లేచిపోయి బట్టలు మార్చుకుని, బండి తాళాలందుకుని బయటకెళ్లిపోయారు. బిక్కమొహంతో నేనలా చూస్తుండిపోయాను. 'ఎక్కడ దెబ్బ కొట్టాలో అక్కడే కొట్టావత్తయ్యా' అనుకోకుండా ఉండలేకపోయాను. రాత్రి పదకొండు దాటుతుండగా ఆయన చిన్న కారేజ్‌లో నాకోసం భోజనం తీసుకొచ్చి నేను తినేదాకా తానుకూడా డైనింగ్ టేబుల్ దగ్గరే తోడుగా కూర్చున్నారు. అత్తగారింట్లో తాను తినేసి నాకోసం అత్తగారు వండి కారేజ్ పెట్టిస్తే తెచ్చారన్నమాట. ఇదంతా నాకు తెలుసు. కానీ అడగలేదు. థాంక్స్ చెబితే లోకువైపోతాననిపించింది.

***

మర్నాడు సరిగ్గా తెల్లారకుండానే చిన్న సంచి, పాన్ డబ్బాతో సహా కరీమున్ వచ్చేసింది. భర్త నుంచి విడిపోయిన పెద్దకూతుర్ని పెద్దమ్మగారింట్లో వదిలి తానిలా వచ్చిందిట. "పెద్దమ్మగారే నన్నిక్కడికి వెళ్లమని బస్సుకి పైసలవీ ఇచ్చి పంపారు చిన్నమ్మగారూ" అంటూ పనిలో పడిపోయింది.

***

ఆ రోజు శనివారం. మా ఇద్దరికీ ఆఫ్ కూడాను. అందులోనూ నా పుట్టిన రోజు . తీరా కరీమున్ చేత స్పెషల్ వంటంతా చేయించేసాక బయటకెళ్దామన్నారీయన. హోటల్లో భోజనం చేసాం. ఇంట్లో చేసిన బిర్యానీ, పాయసం వగైరా అలాగే ఉండిపోయాయి. ఫ్రిజ్‌లో పెట్టేసాను.

మర్నాడు కరీమున్ "సాయంత్రం నేను రానమ్మా. అదేదో సినిమా బాగుందిటకదా. అందరికోసం ఖాజా అడ్వాన్స్‌గా టిక్కెట్లు పట్టుకొచ్చాడు.రెండు పూటలకీ మీకోసం వండేస్తా" అని అంది.

ఫ్రిజ్‌లోంచి బిర్యానీ తీసి వెచ్చబెట్టమన్నాను. కొద్దిగా ఉదయం టిఫిన్‌గా నేను తిన్నాను. మిగతాది నువ్వు తినేయ్ అన్నాను. అపనమ్మకంగా ఓ క్షణం నా కళ్లల్లోకి సూటిగా చూసిందామె. "ఇంటికి తీసుకెళ్తాలెండి" అనేసి వంటింటి పనిలో మునిగిపోయింది.

"హూ... ఇంటికి తీసుకువెళ్తుందిట. ఆ కాస్తంత కూడా దాంతోపాటు ఏదన్నా మరికొంత ఇస్తే పట్టుకుపోవచ్చనేమో" స్వగతంలా అనుకోబోయి పైకే అనేసాను.ఈయనగారి చెవిలో పడిందది. చదువుతున్న పేపరు పక్కకి తప్పించి ఏదో అనబోయి ఆగి మళ్లీ పేపరు చదవడంలో లీనమైపోయారు.

నేను స్నానం చేసొచ్చేసరికి హాల్లో కరీమున్ వాళ్లాయనా, ఇద్దరు కూతుళ్ళూకొడుకూ కోడలూ మనవళ్ళు అంతా హాలు నిండిపోయి నిలబడున్నారు. మరి కాసేపటికి తల తుడుచుకుంటూ బెడ్రూంలోంచి బయటకొచ్చేసరికి ఈయనగారు కిటికీలోంచి వంటింటి ముందున్న ఖాళీ జాగావైపు చూడమని సైగ చేసారు. ఖాజా భుజమ్మీద కండువా దులిపి కిందపరిచాడు. చుట్టూ కూర్చున్నవారంతా కరీమున్ నేనిచ్చిన బిర్యానీ గిన్నె తెచ్చి కోడలి చేతికిచ్చింది. ఆమె గిన్నెలోంచి కొంత కొంత తీసి అందరికీ చేతుల్లో పెట్టింది. అందరూ కళ్లకద్దుకుని తిన్నారు. చివరగా అత్త నోటికందించి ఆ తరువాత మిగిలిన ముద్ద తాను తిన్నది కోడలు. కూతురు అందరికీ మంచినీళ్లిచ్చింది. తాగాక అందరూ ప్రార్థన చేసారు.హాల్లోకొచ్చి మా ఇద్దరికీ వంగి సలాం చెప్పారు వెళ్లొస్తామన్నట్లుగా. ఈయనగారు లేచి పిల్లల చేతికి రెండువంద రూపాయలు ఇచ్చారు "ఇంటర్‌వెల్‌లో కూల్‌డ్రింక్‌లు తాగండి" అంటూ.

"వద్దు బాబూ! మరోసారి ఇద్దురుగాని" అంటూ ఖాజా పిల్లలకడ్డంగా వెళ్లి నిలబడ్డాడు.

"నీకివ్వడంలేదులే బాబాయ్... పిల్లలకిస్తున్నాను" అంటూ ఎంతో పెద్దరి

కంగా పిల్లల చేతిలో పెట్టారీయన. వాళ్ల ముఖాలు ఆనందంతో వెలిగిపోతుండగా వెళ్లిపోయారంతా. ఏకంగా రెండువందలు ఇవ్వడం చూసానేమో... అతన్ని బాబాయ్ అని పిలవడం పుండు మీద కారం జల్లినట్టయి ఒళ్ళు మండిపోయింది నాకు. తలుపలా వేసొచ్చానో లేదో ఆయనమీద విరుచుకుపడ్డాను మాటల ఈటెలతో.


"అనాకాణీ విలువ చేయని వారితో మీ బంధుత్వాలేమిటసలు. వారికి సలాములు చేయడమేమిటి? మనం వారి కింద పని చేస్తున్నామా? వాళ్ళు మనకింద పని చేస్తున్నారా? అయినా అంతలేసి డబ్బులిచ్చేయడమేనా? కరీమన్‌కు ఎప్పుడైనా పాన్ కోసం ఐదూ పది ఇస్తే తప్పనను. తను మనింట్లో పని చేస్తోంది. కానీ మందలకొద్దీ వస్తే అంతమందికీ వందలకి వందలు ఇచ్చేస్తూ పోతే మనకు మిగిలే ఆస్తి చేతిలో చిప్పే" కోపంతో కంపించిపోతూ ఆవేశంగా అరుస్తూనే ఉన్నాను. ఆయన చేతితో కాసేపాగు అన్నట్లు సైగ చేసారు.

"ఒక్క మాట. వాళ్ళు మన దగ్గర పని చేస్తున్నారు. ఒప్పుకుంటాను. పని చేస్తున్నంత మాత్రాన వాళ్ళు మనసున్న మనుషులు కాదంటావా నువ్వే చెప్పు? మనం మాత్రం ఒకరికింద పని చేస్తున్నవాళ్లమే కదా. కరీమున్ వాళ్లమ్మ మా మమ్మీతోపాటు నాన్నగారింటికొచ్చిందిట. వాళ్ల అమ్మమ్మ కూడా మా అమ్మమ్మతో వాళ్లింట్లో వంటా అదీ చేసేదట. కరీమున్ పెళ్లి మా మమ్మీ డాడీనే చేసారు. ఆమె పిల్లల చదువులకూ, పెళ్లిళ్లకూ కూడా మా మమ్మీ డాడీనే డబ్బిస్తూ వస్తున్నారు. వాళ్లనెప్పుడూ ఇంటివాళ్ళుగానే బాధ్యతగా చూసారు. జీతం ఇవ్వండనీ, ఇంతివ్వండనీగానీ వాళ్లెప్పుడూ అడగరు. నువ్వన్నావు చూడు మనకు మిగలబోయే ఆస్తి గురించి... నీ అంచనా ప్రకారం మేమీరోజు అడుక్కుతినే స్థితిలో ఉండాల్సిందే. కానీ మేమంతా బాగున్నాం. నీకా దిగులు అక్కర్లేదు. వాళ్ల సేవలే కాదు, వాళ్ల ఆశీస్సులు కూడా మాతో వున్నాయని మాకు నిశ్చింత. సరేనా! నిన్ను పెళ్లినాటి నుండి గమనిస్తున్నాను. త్వరగా ఏ మనిషినీ నమ్మే అలవాటు లేదు నీకు. పేదవాళ్లయితే నీకు దొంగలుగానో, దగాకోరులుగానో తప్ప మంచి మనుషులుగా కన్పించరు. ఇప్పుడే చూసావుగా నువ్విచ్చినది కాస్తే అయినా తలో ముద్దా పంచుకు తిన్నారు. దొరికిన వాడిదే హక్కు అన్నది వాళ్ల స్వభావంలో లేదు. పొట్ట కూటి కోసం పేదవాడు చిన్న పాకెట్లో, ఇల్లో దోచుకుంటాడు. కానీ కోట్లకు పడగలెత్తినవాళ్ళు ప్రజల్ని, ప్రభుత్వాన్నీ తమ మోసాలతో కోట్లల్లో దోచుకుంటున్నారు. ఎటొచ్చీ పేదల చింకి పాతల చిరుగులు వారినిట్టే పట్టించేస్తాయి. వారిని అనుమానించేలా చేస్తాయి. డబ్బు గలవారి సిల్కు దుస్తులు తళుకు బెళుకులు వారివైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయనివ్వవు. సభ్యత, సంస్కారాల బూటకపు తెరలో అక్కడేం జరిగినా బయటకి పొక్కదు.

ఇక మురళి... నీ దృష్టిలో ఆఫ్టరాల్ క్లాస్ ఫోర్. అతని గురించి నీకు తెలియదు. అతను గ్రాడ్యుయేట్. ఇప్పుడు ప్రిలిమ్స్‌కి ప్రిపేరవుతున్నాడు. మొన్న పదివేలకిపైగా డబ్బున్న నా క్యాష్ బ్యాగ్ నా క్యాబిన్‌లో వదిలేసొస్తే ఆ రోజు పొద్దుపోయినా ఎంతో జాగ్రత్తగా పదిలంగా ఇంటికి తీసుకొచ్చాడు. అతనికి టీ చేసి ఇమ్మంటే నామోషీగా ఫీలయ్యావు. నాతో సమానంగా ఇంట్లో సోఫాలో కూర్చోబెట్టి మర్యాద చేసానని నీకెంతో కోపం వచ్చి అలిగావు. నేను గౌరవించింది అతని విధేయతనీ, నిజాయితీని. రేపుఅతని ధ్యేయం నెరవేరి ఐఏఎస్ అయితే మనమే అతనికి నమస్కారం పెట్టాల్సి రావచ్చు. ఖాజా పిల్లలకి డబ్బిచ్చానని నువ్వు ఆస్తులు కరిగిపోతాయంటున్నావు. నేనెలా అనుకోను. ఆ కాస్తంత సాయానికీ కృతజ్ఞతాభావంతో వెలిగిపోయే ఆ ముఖాల్లోని తృప్తీ, ఆనందం ఇవే ఎన్నెన్నో ఆస్తుల పెట్టుగా తోస్తాయి నాకు. నీలా నేను అందర్నీ అనుమానంతో చూడలేను. మమ్మీవాళ్ళు నీకోసం అదే నా కోసం కూడాననుకో ఎంత చేసినా ఇన్ని సౌకర్యాలు అమర్చినా నీకు వాళ్ల మంచితనం ప్రేమా గ్రహింపుకొచ్చినా నీ అనుమానపు గుణంతోనూ, అహంతోనూ ఎవరికోసం చేస్తార్లే అన్నట్లు మిన్నకుండిపోయావు. నోరు తెరిచి ఒక్కసారి కూడా కాస్తంత కృతజ్ఞతాసూచకంగా కాకున్నా ఆనందం అంటూ వ్యక్తం కాలేదు నీ నుంచి. అనుమానం పెనుభూతం అన్నారందుకే. ఒకసారది నెత్తినెక్కి కూర్చుందంటే మరిక దిగదు. దానికి తోడు అహం... ఈ రెండూ నీకు అందర్నీ దూరం చేస్తున్నాయి. ఇన్ని రోజులూ ఓపిక పట్టాను. ఇకనైనా నిన్ను హెచ్చరించకపోతే నీ అనుమానపు భూతం నన్నూ పట్టుకోవచ్చు. నీ అనుమానం నామీద కూడా సవారీ చేయవచ్చు. ఈ దూరాలోచనే నిన్నిలా నిలదీసేలా చేసిందీ రోజు. నిన్ను నొప్పించాలనీ, నిన్ను కించపరచాలనీ నాకే కోశానాలేదు. అలాగని వేరే వాళ్ల దృష్టిలో నువ్వు చెడ్డదానివిగా పేరు పడడం నాకు నచ్చదు. అలాగే మనం ఇలా ఆవేశాల్లో అరుచుకుంటూ కాపురాన్ని వీధిన పడకుండా ఉండాలంటే నిన్నిలా హెచ్చరించక తప్పడంలేదు. ఇకపై అంతా నీ ఇష్టం" అతి శాంతంగా, సౌమ్యంగా తను చెప్పాల్సింది చెప్పడం అయిపోయినట్టు లేచి వెళ్లిపోయారు.

ఒక్కసారి స్పృహ వచ్చినట్టయింది నాకు. చూద్దునుకదా నా తల భూమిలోకి కుంగిపోయినట్టయింది. ఇకనైనా నేను తలెత్తుకోగలనా?

★



## సెకండ్ ఇన్నింగ్స్

ఓవర్ వెయిట్ కారణంగా 'సదా మీ సేవలో' చిత్రంలో అవకాశాన్ని కోల్పోయిన రక్షితకి తన తప్పేంటో తెలిసివచ్చినట్టుంది. ఇప్పుడామె సరికొత్త లుక్స్‌తో తెరపైకి రాబోతోంది. జగపతిబాబు హీరోగా నిర్మాణమవుతున్న తాజా చిత్రంలో నాయికగా అవకాశాన్ని సంపాదించుకున్న రక్షిత ఈ చిత్రంతో తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నట్టుంది అంటున్నారు. కాస్త స్లిమ్ అయి గ్లామర్‌ని పెంచుకుని దర్శనమివ్వబోతున్న రక్షితకి ఈ సినిమా కలిసొస్తుందని ఆశిద్దాం.

